

భూములిచ్చినా ఏం లాభం!



గారెపల్లి నూతన రిజర్వాయర్

- పరిహారం రాక రైతుల పరేషాన్
- చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు భూములు సేకరించిన నాటి వైఎస్ సర్కారు
- 16 ఏళ్లుగా తప్పని నిరీక్షణ
- దళారులదే ఇష్టారాజ్యం
- రూ. 2కోట్ల మేర అవకతవకలు
- అసలైన అన్నదాతలకు అందని పైకం

కాటారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆ రైతుల త్యాగాలు వృథా పోయాయి. చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గారెపల్లి నూతన రిజర్వాయర్, స్టేజ్-2 పంప్‌హౌస్ నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వానికి తమ భూములను కట్టబెట్టారు. తమకు కొంత నష్టం జరిగినా రైతులందరికీ ప్రయోజనం చేకూరుతుందని భావించి జీవనాధారమైన వ్యవసాయ భూములను ఇచ్చేశారు. భూసేకరణ సేకరణకు తీవ్ర జాప్యమైంది. ఈ క్రమంలో కొందరు దళారులు రంగ ప్రవేశం చేశారు. వీరికి లంచావతారులైన అధికారులు తోడయ్యారు. కొందరు రైతులకు మాత్రమే పరిహారం అందగా, అనర్హులు సైతం అందులో లబ్ధిపొందారు. నిఖార్సైన 50-60 మంది రైతులకు మాత్రం పరిహారం అందలేదు. 15 ఏళ్లుగా వీరు నిరీక్షిస్తున్నారు. చెప్పులు అరిగేలా అధికారులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా వీరి ఆవేదనను ఆలకించే వారే కరువయ్యారు.

397 ఎకరాల భూమి సేకరణ

కాళేశ్వర-ముక్తీశ్వర ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు)లో భాగంగా గారెపల్లి నూతన రిజర్వాయర్, స్టేజ్-2 పంప్‌హౌస్ నిర్మాణం చేయడానికి అధికారులు ప్రతిపాదించారు. 2008లో అప్పటి సీఎం దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. దీంతో గారెపల్లి రిజర్వాయర్, పంప్‌హౌస్ నిర్మాణం కోసం గారెపల్లి, చిద్నెపల్లి రెవెన్యూ శివారుల్లోని సుమారు 397 ఎకరాల భూమిని సేకరించడానికి అధికారులు ప్రతిపాదించారు. అప్పట్లో ఎకరాకు రూ. 3.50 లక్షల పరిహారం చెల్లించడానికి అధికారులు నిర్ణయించారు. సేకరించిన భూమిలో పట్టా భూములతోపాటు పెద్ద ఎత్తున లావణీ పట్టా, ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నాయి. దీంతో అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే జరిపి పరిహారం ఇవ్వడానికి పూనుకున్నారు.

16 ఏళ్లుగా ఎదురుచూపులు

నూతన రిజర్వాయర్, పంప్‌హౌస్ నిర్మాణం కోసం 2009లో భూసేకరణ చేపట్టారు. అయినా కొందరికి నేటికీ పరిహారం అందలేదు. 16ఏళ్లయినా పరిహారం అందలేదని పలువురు భూనిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా సుమారు 50 ఎకరాల భూములకు సంబంధించిన పరిహారం 50-60 మందికి అందలేదని రైతులు అంటున్నారు. గతంలో ఎకరాకు పరిహారం కింద రూ. 3.50 లక్షలు చెల్లించగా ఇవి సరిపోవని పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం నూతన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పనులు నిలిపేయగా అధికారులు స్పందిస్తూ ఎకరాకు రూ. 9 లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులకు సుమారు రూ.4 కోట్ల మేర పరిహారం రావాల్సి ఉంది. అయితే.. అధికారులు, నాయకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్లు 41, 42, 44, 48, 49, 53, 54, 60, 192, 196, 197, 199లలో సుమారు 50ఎకరాల మేర భూమికి పరిహారం రావాల్సి ఉందని, ఒక్క 41 సర్వే నంబర్‌లోనే 33 ఎకరాలకు పరిహారం అందలేదని రైతులు అంటున్నారు. అధికారులేమో 41 సర్వే నంబర్‌లో మొత్తం డబ్బులు ముట్టాయని అనధికారికంగా చెప్పడం గమనార్హం. దంతెలపల్లికి చెందిన ఓ నిరుపేద దళిత దంపతులు ఎదురు చూసి చూసి మరణించగా అనాథగా మారిన వారి కుమారుడికి ఇంకా పరిహారం దక్కలేదు.

భారీ అవకతవకలు

భూసేకరణలో కొందరు దళారులు, నాయకులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. పాత రెవెన్యూ రికార్డుల్లో భూమి ఉండగా క్షేత్రస్థాయిలో భూమి లేని వారికి పరిహారం అందినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. భూమి పట్టా ఒకరి పేరిట ఉండగా కాస్తులో వేరే వాళ్లు ఉండటంతో అవకతవకలు చోటుచేసుకున్నట్లు, అప్పటి కొందరు అధికారులు దళారులకు సహకరించినట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. లావణీ పట్టా, అసైన్డ్ భూములు ఉండటంతో రికార్డుల ప్రకారం పేర్లు ఉన్నవారు, భూములను సాగు చేసుకుంటున్న వారి మధ్య ఒప్పందం చేయిస్తామని, పరిహారం ఇప్పిస్తామని కొందరు దళారులు రైతుల వద్ద లక్షలాది రూపాయలు డబ్బులు దండుకోవడం, అనర్హులకు పరిహారం అందేలా చూడటం వంటి పనులతో తమ పంట పండించుకున్నారు. ఓ దళారీ పరిహారం వచ్చేలా చూస్తామని చెప్పి ఎకరాకు రూ. లక్ష చొప్పున వసూలు చేశాడని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పటి అధికారుల సహకారంతో భూమి లేని వారి పేరిట, గుంటల్లో భూమి ఉన్న వారికి ఎకరాల్లో పరిహారం అందేలా దళారులు స్కెచ్ వేసి



చిన్న కాళేశ్వరం స్టేజ్-2 పంప్‌హౌస్

» మిగతా 8వ పేజీలో...

1.16 ఎకరాలకు పరిహారం రాలేదు..

- తైనేని రాజక్క సబ్‌స్టేషన్‌పల్లి



గారెపల్లి నూతన రిజర్వాయర్ నిర్మాణం కోసం భూమిని తీసుకున్నారు. భూమి తీసుకున్నారు గానీ డబ్బులు ఇవ్వలేదు. 16ఏళ్లుగా పరిహారం అందక ఎదురుచూస్తున్నాం. గారెపల్లి శివారు 49సర్వే నంబర్‌లో ఎకరం 16 గుంటల భూమికి సంబంధించి డబ్బులు రావాల్సి ఉంది. జీవనాధారమైన భూములను కోల్పోయి పరిహారం కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

పైసలు రాక పరేషాన్ అవుతున్నం..

- బౌతు ఆశమ్మ, దంతెలపల్లి



మా కుటుంబానికి చెందిన రెండెకరాల భూమి రిజర్వాయర్ కింద పోయింది. గారెపల్లి శివారు 41 సర్వే నంబర్‌లో రెండెకరాల మంచి పంటలు పండే భూమిని కోల్పోయినాం. పరిహారం వస్తే ఎక్కడైనా భూమి కొనుక్కొని బతుకుదామని అనుకున్నాం. 16 ఏళ్ల అవుతున్నా ఇప్పుడు, అప్పుడు అంటూ కాలం గడుపుతున్నారు. కలెక్టర్ స్పందించి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందియ్యాలే.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

గణపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరులో శ్రీ సీతారామాంజనేయ వేణుగోపాలస్వామి, బొడ్రాయి, పోచమ్మ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం కనుల పండువగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం భోరణ బంతి మహాపూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహదాతలు సూర్యనేని తిరుమల్- రావుచంద్రకళ దంపతుల ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ పూజ నిర్వహించి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, శ్రీ సీతారామాంజనేయ వేణుగోపాలస్వామి, ధ్వజస్తంభ, విమానశిఖర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిపించారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఈ వేడుకకు హాజరయ్యారు. రైతులంతా సంతోషంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ జాతరలో 3,197 మందికి వైద్యసేవలు

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో 3,197 మంది భక్తులకు వైద్యసేవలు అందించామని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బందితో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మేడారం జాతర సందర్భంగా జనవరి 26 నుంచి ఈనెల 16 వరకు టీటీడీ కల్యాణ మండపం, బస్టాండ్, జంపన్నవాగు, బయ్యక్కపేట, కొండాయి, ఐలాపూర్‌లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించినట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించామని తెలిపారు. నిరంతర వైద్యసేవలతో సమన్వయంతో కలిసి పనిచేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రణధీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పూర్ణ, సంపత్‌రావు, డెమో సంపత్, ఎస్‌వో స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు అన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ వ్యాన్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అందులో స్వయంగా కోర్టు ప్రాంగణం నుంచి బస్టాండ్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న జడ్జి నారాయణబాబు

అడుగడుగునా తనిఖీలు

ఇసుక రవాణాపై అధికారులు, పోలీసుల నజర్

ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు



మహదేవపూర్ జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహదేవపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కట్టడి చేస్తోంది. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు నిరంత పర్యవేక్షిస్తున్నారు. అడుగడుగునా తనిఖీలు చేస్తున్నారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు ఉండటంతో అధికారులు నిరంతర నిఘా పెట్టారు. మరో వైపు విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు చేస్తున్నారు.

మండలంలో 9 నుంచి 10 క్వారీలు

మహదేవపూర్ మండలంలో పలుగుల, మద్దుల పల్లి, కుంట్లం, పుసుకపల్లి, కుదురుపల్లి ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. గతంలో ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున మహారాష్ట్ర, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఇసుక పెద్ద ఎత్తున తరలిపోయేది. ఈ క్వారీలలో ఇప్పటికే అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. బకెట్ టు బకెట్‌ను కౌంట్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. టెండర్లు పాడి ఇసుక రీచ్‌లు పట్టుకున్నవాళ్లు ఇది వరకు లక్షల్లో అక్రమంగా సంపాదించేవాళ్లు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. గోదావరిలో ఎంత ఇసుక ఉంటే అంత పక్కదారి పట్టేది. ఇక నుంచి ఒక్క బకెట్ తరలించినా ప్రభుత్వ యంత్రాంగానికి లెక్క చెప్పాల్సిందే. ఓవర్‌లోడ్.. పరిమితికి మించి ఎక్కువగా ఇసుక తరలించడం.. వే బిల్లులు లేకుండానే పెద్ద ఎత్తున రాత్రివేళ్లలో ట్రిప్పులు కొట్టడం ఇక ఉండదని ఇప్పటికే అధికారులు ఇసుక క్వారీ నిర్వాహకులకు తేల్చి చెప్పారు.

నిబంధనలు ఇవే..

నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చూడాల్సి ఉంటుంది. ఇసుక రవాణా చేస్తే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో పలు మార్పులు జరగాలి. ఆఫీస్ టైపింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉంచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. అక్రమ ఇసుక రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఉంటుంది. ప్రతి రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్‌లైట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిబంధనల్లో తెలిపింది. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌తో పాటు ఎంట్రీ ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా అందిచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

చెక్ పోస్టుల ఏర్పాటు

మహదేవపూర్ మండల పరిధిలో కొయ్యూర్, కాటారం మండలం మద్దుల పల్లి వద్ద నిరంతర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతీ అంశాన్ని రికార్డు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. రాత్రిబంవళ్లు ఇక్కడ కాపాలాగా పోలీసులు, అధికారులు ఉండనున్నట్లు సమాచారం.

ఇసుక క్వారీల కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు

ఇసుక క్వారీ కాంట్రాక్టర్ అంటే లక్షల్లో ఆదాయం.. చుట్టూ పది మంది వర్కర్లు, లారీల కొద్దీ ఇసుకను రీచ్‌ల వద్ద జమ చేసి దర్జాగా వ్యాపారం చేసేవారు. ఇప్పుడు ఆ ఆటలు సాగవని తెలుస్తోంది. దీంతో దిక్కుతోచని స్థితిలో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. కొందరు తమ ఇసుక క్వారీల వద్దకు అధికారులు, పోలీసులు రాకుండా పైరవీలు చేసి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది.

సింగరేణి ఫారెస్ట్ కార్యాలయానికి సీల్

ఇద్దరు ఉద్యోగులకు నోటీసులిచ్చిన అధికారులు

ముఖ్యమైన మూడు ఫైళ్లు మిస్!

కాకతీయఖని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యాలయానికి విజిలెన్స్ అధికారులు ఈ నెల 12 సీల్ వేయించారు. దీంతో వారం రోజులుగా కార్యాలయం మూతబడి ఉంది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో రూ.2 కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2021 నుంచి 2024 వరకు చెట్లు నరకడం, వాటిని అమ్మడంలో ఇద్దరు కాంట్రాక్టర్లు, సింగరేణి ఫారెస్ట్ అధికారి ఒకరు అక్రమాలకు పాల్పడినట్లు మరో కాంట్రాక్టర్ సింగరేణి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వారు పట్టించుకోక పోవడంతో సింగరేణి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, స్టేట్ ఎనర్జీ సెక్రటరీకి కాంట్రాక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. 2021 నుంచి 2024 వరకు 4,206 మెట్రిక్ టన్నుల పల్ప్ ఉడ్ (తొక్కతీసిన జామాయిల్ కర్ర) సింగరేణి వేబ్రిడ్జిపై బరువు కొలిచి అమ్మారని, అధికారిక లెక్కల్లో మాత్రం 1,170 టన్నులు చూపించారని పేర్కొన్నట్లు సమాచారం. ఇలా గడిచిన నాలుగు సంవత్సరాల్లో సుమారు రూ. 2కోట్ల వరకు అవినీతి జరిగిందని వివరించినట్టు తెలిసింది. 2016 నుంచి లెక్కలు తీస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లు ఆ ఫిర్యాదులో కాంట్రాక్టర్ పేర్కొన్నట్లు సమాచారం. దీంతో సింగరేణి విజిలెన్స్ అధికారులు ఇటీవల భూపాలపల్లి ఏరియా సింగరేణి ఫారెస్ట్ కార్యాలయంలో దాడులు చేపట్టి ఓ కింది స్థాయి ఉద్యోగిని విచారించారు. వారి విచారణలో అనేక అంశాలు వెలుగు చూసినట్లు కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు.

ఉద్యోగి ఖాతాలో రూ. 18 లక్షలు?

భూపాలపల్లి సింగరేణి ఫారెస్ట్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్న ఓ కింది స్థాయి ఉద్యోగి ఖాతాలో సుమారు రూ. 18 లక్షల సొమ్మును విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల విజిలెన్స్ అధికారులు అతడిని విచారిస్తున్న క్రమంలో కాంట్రాక్టర్ల ఖాతాల్లో నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే ఇతర డిజిటల్ పేమెంట్ల ద్వారా ఆ ఉద్యోగి ఖాతాలో కొంత సొమ్ము జమ అయినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారని కార్మికులు అంటున్నారు. దీంతో ఆ ఉద్యోగి సెల్‌ఫోన్‌ను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారని చెబుతున్నారు. అయితే.. ఓ కింది స్థాయి ఉద్యోగికి కాంట్రాక్టర్స్ ఎందుకు అంత మొత్తం ఇస్తున్నారని, ఆ సొమ్ము అతడికేనా.. లేక అతడు ఎవరికైనా బినామీగా పనిచేస్తున్నాడా? అని కార్మికుల్లో చర్చ జరుగుతోంది. ఈ తతంగమంతా బయట పడాలంటే సింగరేణి విజిలెన్స్ కాకుండా సెంట్రల్ విజిలెన్స్‌తో విచారణ జరిపించాలని అంటున్నారు.

ఆ ఫైళ్లు ఏమయ్యాయి?

గనులు, ఓపెన్ కాస్ట్ప్రాజెక్ట్‌ల పరిసరాల్లో ఉన్న యూకలిప్టస్ (జామాయిల్) చెట్ల, టింబర్ వివరాలను సింగరేణి ఫారెస్ట్ అధికారులు ఎప్పటికప్పుడు రికార్డుల్లోకి ఎక్కిస్తుంటారు. అయితే విజిలెన్స్ అధికారులు ఫైళ్లను పరిశీలిస్తున్న క్రమంలో మూడు ముఖ్యమైన టింబర్ ఫైళ్లు మిసయ్యాయని వారు గుర్తించినట్లు కార్మిక వర్గంలో తీవ్ర చర్చనడుస్తోంది. ఆ ఫైళ్ల ఏమయ్యాయని సింగరేణి ఫారెస్ట్ ఉద్యోగులను విజిలెన్స్ అధికారులు ప్రశ్నించగా అవి కనిపించడంలేదని తాపిగా సమాధానం చెప్పి ఉద్యోగులు చేతులు దులుపుకున్నారని సమాచారం. ఎంతో విలువైన ఫైళ్లు కనిపించకపోవడంతో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు

భూపాలపల్లి ఏరియా సింగరేణి ఫారెస్ట్ డిపార్ట్‌మెంటుపై వచ్చిన ఆరోపణలపై సింగరేణి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కింది స్థాయి ఉద్యోగి సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు సమాచారం. అయితే ఒక్క రోజు సహకరించిన ఉద్యోగి తెల్లారి నుంచి అందుబాటులో లేడని తెలుస్తోంది. అతడితోపాటు మరో ఉద్యోగి కూడా విధులకు హాజరు కాకపోవడంతో విజిలెన్స్ అధికారులు ఏరియా సెక్యూరిటీ సిబ్బందితో కార్యాలయానికి సీల్ వేయించి అందులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు ఇవ్వాలని ఏరియా సింగరేణి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఏరియా అధికారులు ఇటీవల ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు ఇచ్చేందుకు ఇంటికి వెళ్లగా అక్కడ వారు లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేసినట్లు సమాచారం. దీంతో ఇద్దరు ఉద్యోగులు విజిలెన్స్ అధికారుల ఎదుట సోమవారం హాజరు అవుతామని ఏరియా సింగరేణి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే.. విచారణకు హాజరయ్యారో లేదో తెలియాల్సి ఉంది.



సీల్ వేసి ఉన్న సింగరేణి ఫారెస్ట్ కార్యాలయం

భూపాలపల్లి ఏరియా కేటీకే-1వ గని రహదారిలో ఉన్న జామాయిల్ చెట్లు



జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాకు ఆలయ చరిత్రను వివరిస్తున్న గైడ్ విజయ్

రామప్పను సందర్శించిన
జైళ్ల శాఖ డీజీపీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సౌమ్యమిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు. ఆమె వెంట ములుగు పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ దేశస్థులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిల్పకళను కనులారావీక్షించి తమ కెమెరాల్లో బంధించుకున్నారు.

ఘనంగా
ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



కోదండ రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ చేయిస్తున్న అర్చకులు గోపి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో సోమవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ప్రధాన అర్చకులు గోపి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం 8.19 గంటలకు భక్తుల రామనామస్మరణతో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపించారు. ధ్వజస్తంభ దాతలు తాతినేని విచ్చేశ్వరరావు-సునంద, మాచినేని సాంబశివరావు-సరోజన, సూది లక్ష్మారెడ్డి-స్వప్న దంపతులు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మాచినేని బాబురావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మరాజు సత్యనారాయణతోపాటు భక్తులు పాల్గొన్నారు.

భాగ్యతండాలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

- 'కల్యాణలక్ష్మి'కి స్ఫూర్తినిచ్చిన కీమానాయక్ కుటుంబంతో కలిసి సంబురాలు
- మహిళలకు చీరలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు
- జ్ఞాపకాలను నెమరేసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



భాగ్యతండాలో కీమానాయక్ కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ నాయకులు

ములుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి పథకం పురుడుపోసుకున్న ములుగు జిల్లా ములుగు మండలం భాగ్యతండాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరిపారు. పథకానికి స్ఫూర్తినిచ్చిన కీమానాయక్ కుటుంబ సభ్యుల సమక్షంలో సంబరాలు చేసుకున్నారు. ఆడబిడ్డల పెళ్లి పేద తల్లిదండ్రులకు భారంగా మారకూడదనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టగా.. అన్నివర్గాల మన్ననలు అందుకున్న విషయం తెలిసిందే. 2002లో భాగ్యతండాలో జరిగిన ఓ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు కేసీఆర్ పలు వేదికలపై చెప్పారు. ఆనాడు కేసీఆర్ వెంట ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. తండాలో అగ్నిప్రమాదం జరగ్గా 20కిపైగా ఇళ్లు కాలిపోగా.. బుజ్జి-కీమానాయక్ దంపతులు తమ కుమార్తె కల్పన వివాహం కోసం దాచుకున్న డబ్బులు, బంగారం, పెళ్లిబట్టలు సర్వం కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకొని స్వయంగా భాగ్యతండాకువచ్చిన కేసీఆర్ కల్పన వివాహానికి రూ.50వేల ఆర్థికసాయం చేయడంతోపాటు పెండ్లికి కావాల్సిన సామగ్రిని అందజేశారు. ఈ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి రూపకల్పన చేశారు. కాగా, కల్పన-యాకూబ్ దంపతులకు ఇద్దరు సంతానం కలగగా వారి కుమార్తె చంద్రకళకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో గతంలో వివాహం జరిపించారు. అదేరోజు కల్యాణలక్ష్మి సాయాన్ని అందజేశారు. చంద్రకళ ఇటీవల ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఇలా మూడు తరాలకు చెందిన ఆడబిడ్డల సమక్షంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకోవడం గొప్ప విశేషమని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆయన మూలాలను చెరిపివేస్తామని కొందరు కలలుకంటున్నారని, అది వారి అవివేకమన్నారు. ఆడబిడ్డ కడుపులో పడ్డ నాటినుంచి వివాహం వరకు ప్రభుత్వం అండగా నిలిచేలా పథకాలను రూపొందించిన కేసీఆర్ పేద కుటుంబాలను ఆదుకున్నాడని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ సమాజం మర్చిపోదని తెలిపారు. ఈ సందర్భంగా కీమానాయక్, కల్పన, చంద్రకళ దంపతులను సన్మానించడంతోపాటు స్థానిక మహిళలకు చీరెలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ములుగు, మల్లంపల్లి మండల అధ్యక్షులు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పాలెపు శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ములుగులోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్‌చేసి మొక్కలు నాటారు. మిర్చి తోటలో పనిచేస్తున్న రైతులు, కూలీలతో కలిసి కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.



మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మార్చి 2న ధర్నాచౌక్‌ను
జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద మార్చిన 2న జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మోబిన్ అహ్మద్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద నిర్వహించబోయే కార్యక్రమ యుద్ధభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయలకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలన్నారు. ఉద్యోగుల పదవీమరణ పొందిన బెనిఫిట్స్ కూడా రాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీ, రఫిక్, బత్తుల శ్రీనివాస్, మల్లేష్, సింగు రమేష్, కిషోర్, వెంకట్‌రెడ్డి, స్వరూపరాణి, వీరు నాయక్, వీరలక్ష్మీ, ఝాన్సీ, స్వాతి, డోలి అనిల్‌కుమార్, సత్యనారాయణ, వెంకట్, ఉమాంజలి, అబ్దుల్ సత్తార్, లక్ష్మీ, స్వాతి, అరుణ పాల్గొన్నారు.

భూమి పట్టా చేయించుకుని..
బాగోగులు చూడడం లేదు..

- పెద్దకుమారుడి ఇంటి ఎదుట తల్లి ఆందోళన
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఘటన



గొల్లచర్లలో కుమారుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కమలమ్మ

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తన పేరిట ఉన్న భూమిని కొందరు అధికారుల సాయంతో గతంలో అక్రమంగా పట్టా చేయించుకున్న తన పెద్ద కుమారుడు.. తన బాగోగులు చూడటం లేదంటూ ఓ వృద్ధురాలు తన కుమారుడి ఇంటి ఎదుట నిరసన తెలిపింది. ఈ సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్లలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. గొల్లచర్ల గ్రామానికి చెందిన తాటికొండ కమలమ్మకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి. ఇక కమలమ్మ భర్త 25 ఏళ్ల క్రితం మృతి చెందగా ముగ్గురు కుమారులకు ఆస్తిపంపకాలు చేశారు. ఆ సమయంలో వారికి మొత్తం 9ఎకరాలు ఉండగా.. కమలమ్మ పేరిట 2.30 గుంటలను ఉంచి.. మిగతా భూమిని అన్నదమ్ములు పంచుకున్నారు. ఆ తర్వాత ఎనిమిదేళ్ల క్రితం తన పెద్దకుమారుడైన మల్లారెడ్డి తన పలుకుబడి, ఆర్థిక స్థోమతను ఉపయోగించి కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో తనకు, మిగిలిన ఇద్దరు కుమారులకు తెలియకుండా తనపేరిట ఉన్న 2.30 గుంటల భూమిని కూడా అక్రమంగా పట్టా చేయించుకున్నాడని కమలమ్మ ఆరోపిస్తోంది. ఎనిమిదేళ్లుగా ఈ వివాదం కొనసాగుతుండగా పలుమార్లు పెద్దమనుషుల్లో పంచాయితీలు పెట్టామని, అయినా పెద్దకుమారుడి నుంచి ఎలాంటి స్పందన లేదని, రైతుభరోసా, కౌలు డబ్బు కూడా తానే తీసుకుంటున్నాడని, తన బాగోగులు చూడటం లేదని కమలమ్మ వాపోతోంది. తన కు న్యాయం చేయాలంటూ సోమవారం తన పెద్దకుమారుడు ఇంటి ఎదుట నిరసనకు దిగడం చర్చనీయాంశమైంది.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- మొగిలిచర్లకు భారీగా తరలివచ్చిన భక్తజనం
- ప్రభుత్వ విప్ రాంచందర్, ఎంపీ బలరాం ప్రత్యేక పూజలు



మొగిలిచర్లలో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాంనాయక్

కురవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం మొగిలిచర్లలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో యంత్రస్థాపన, శిఖర విమాన గోపుర, కలశ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య వేద పండితులు కండ్లకుంట వేంకట నరసింహాచార్యస్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, స్వామి వారి శాంతి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నూకల అనిత-వేణుగోపాల్‌రెడ్డి, అంబటి వీరభద్రం, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, వద్దుల సురేందర్‌రెడ్డి, ఇస్లావత్ సుధాకర్‌నాయక్, మలేడి నరేష్, జి.రామచంద్రయ్య, చల్లగొల్ల గణేష్, మింగు సమ్మయ్య, కోర్ని రవీందర్‌రెడ్డి, బండి శ్రీను పాల్గొన్నారు.

మిర్చిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర నిర్ణయించి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 25వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారని, తామరపురుగు, తెగుళ్లు, వాతావరణంలో వస్తున్న మార్పులు, నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నకిలీతో పంటకు తీవ్ర నష్టం చేకూరిందని అన్నారు. మరోవైపు పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మార్కెట్ రేట్లపై ప్రభుత్వాలు స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతులకు రైతు భరోసా కింద రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని, మిర్చిని ఇతర దేశాలకు ఎక్స్‌పోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, రత్నం రాజేందర్, కొప్పుల రఘుపతిరావు, పొదిళ్ల చిట్టిబాబు, వాసు, దావూద్, మల్లారెడ్డి, రాజేష్, ఆగిరెడ్డి, చిరంజీవి, దామోదర్, సౌమ్య, చిన్న, దేవయ్య, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ వేధిస్తున్నాడు.. ఆత్మహత్యకు అనుమతివ్వండి

- భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట దంపతుల నిరసన
- ఇరు కుటుంబాల మధ్య భూమి వివాదం నేపథ్యంలో ఆందోళన



కలెక్టరేట్ వద్ద సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులతో మాట్లాడుతున్న భూపాలపల్లి ఆర్డీవో రవి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సై ఇనగాల వెంకటేశ్ తమను మానసికంగా వేధిస్తున్నాడని, తమకు ఆత్మహత్యే శరణ్యమని, అందుకు తమకు అనుమతినివ్వాలంటూ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన దంపతులు సంది సులోచన, ప్రతాప్‌రెడ్డి ఆందోళన చేశారు. భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం వారు నిరసనకు దిగారు. ఆ దంపతులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సంది సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులకు అదే మండలంలోని నర్సింగపూర్ శివారు బండల కుంట చెరువు కట్టకింద సర్వే నెం 30,79, 80లలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక నర్సింగపూర్ గ్రామానికి చెందిన ఇనగాల వెంకటేశ్ ప్రస్తుతం ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వెంకటేశ్ కుటుంబానికి.. ప్రతాప్‌రెడ్డి భూమి పక్కనే ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరి మధ్య చాలా కాలంగా బాట విషయంలో గొడవలు జరుగుతున్నాయి. తమ పొలానికి వెళ్లే బాటను వెంకటేశ్ ఆక్రమించాడంటూ గతంలో హైదరాబాద్ ప్రజాదర్బార్‌లో ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. దాంతో 2023 డిసెంబరు 27న విచారణ చేపట్టిన అప్పటి ఆర్డీవో రమాదేవి పూర్వపుబాటను పునరుద్ధరించాలని ఉత్తర్వులు వెలువరించారు. కానీ ఎస్సై వెంకటేశ్ మాత్రం ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ప్రతాప్‌రెడ్డి-సులోచన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాటను పునరుద్ధరించకుండా అడ్డుకుంటున్నాడని తెలిపారు. వెంకటేశ్ నిర్వాకంతో తమకు జీవనోపాధి లేకుండా పోయిందని, తమకు ఆత్మహత్యే శరణ్యమని, అందుకు అనుమతి ఇవ్వాలని వారు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మను కోరారు. వీరి నిరసన విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఆర్డీవో రవి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. గతంలో ఆర్డీవో ఆదేశాలు ఎందుకు పాటించడం లేదని మొగుళ్లపల్లి తహసీల్దార్‌ను ఆరా తీశారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావుతో మాట్లాడి బాట వేయకుండా అడ్డుకుంటున్న ఎస్సైపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో భరోసా ఇవ్వడంతో ఆ దంపతులు నిరసనను విరమించారు.



జాతర హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు

చింతలగట్టు
హుండీ ఆదాయం 1.94 లక్షలు

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర హుండీలను సోమవారం పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు లెక్కించారు. రూ.1,94,224ల ఆదాయం వచ్చినట్లు పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్ధు, జాతర కమిటీ అధ్యక్షులు పెనక నాగయ్య తెలిపారు. ఈ లెక్కింపులో కారం లక్ష్మయ్య, ఈసం సహదేవులు, ననుప వీరస్వామి, వాసం భద్రయ్య, నరేష్, సుధాకర్, రమేష్, జనార్దన్, పోతయ్య, వజ్జయ్య, సాంబరాజు, అశోక్, భద్రయ్య, బుచ్చమ్మ పాల్గొన్నారు.





ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మాజీ సీఎం కేసీఆర్‌ను
కలిసిన బీఆర్ఎస్ నేతలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపకులు కేసీఆర్‌ను మానుకోట జిల్లాకు చెందిన మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సోమవారం వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఎర్రవల్లిలో మాజీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

సంఘ అభివృద్ధికి విశేష కృషి

- డోర్నకల్ సీఎస్ఐ బిషప్ పద్మారావు

డోర్నకల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ అధ్యక్ష మండల పరిధిలో ఉన్న చర్చిల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డోర్నకల్ సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు అన్నారు. సోమవారం నూతనంగా నిర్మించిన బిషప్ బంగ్లాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి తన సంకల్పంతోపాటు ప్రభు ఆశీస్సులు తోడవ్వడంతో సంవత్సరంలోనే అద్భుత మైన భవనం నిర్మించడం సాధ్యమైందన్నారు.

ఈ కార్యక్రమంలో సీఎస్ఐ మోడరేటర్ రూబిన్ మార్క్, ట్రెజరర్ విశ్వంప్రభాకర్, నాగభూషణం, మోజెస్, నవీన్, సునీల్, శ్రీధర్, సేనం రాజు, రితీష్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఇసాక్, విక్రమ్, ఏసుపాదం, పాస్టర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2305	2100
పల్లికాయ (సూక)	7200	4600
పల్లికాయ (పచ్చిది)	4100	3100
కందులు	7211	5540
పెసళ్లు	5552	4645
పత్తి	6800	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13800	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16000	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	13500	11500
దేశీ ఏసీ	-	-
దీపిక	17200	15245
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రసిద్ధ పర్యాటక స్థలాల సందర్శనకు

ఒక రోజు టూర్

అందుబాటులోకి తెచ్చిన పర్యాటక శాఖ

వివరాలు వెల్లడించిన టూరిజం డీఎం శ్రీనివాసరావు


రామప్ప గుడి

బాలసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల ప్రసిద్ధమైన పర్యాటక స్థలాలను సందర్శించేందుకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు టూర్ ప్యాకేజీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు టూరిజం శాఖ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు హరిత కాకతీయ హోటల్ నుంచి బస్సు బయలుదేరి ముందుగా వేయిస్తంభాల ఆలయం దర్శనం అనంతరం భద్రకాళి అమ్మవారి దర్శనం తరువాత అక్కడి నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి రామప్ప దేవాలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. దర్శనం అనంతరం రామప్పలోని హరిత హోటల్‌లో భోజనం చేసి అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు లక్నవరం సరస్సును సందర్శించడం జరుగుతుందని తెలిపారు. అక్కడ బోటింగ్ చేయాలనుకునే వారు సొంత ఖర్చులను భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు వచ్చి టీ తాగిన అనంతరం సాయంత్రం 6 గంటలకు ఖిలా వరంగల్‌లో సౌండ్ అండ్ లైట్ షోను తిలకించిన అనంతరం రాత్రి 8 గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. ఇందుకు గాను పెద్దలకు రూ. 980, పిల్లలకు రూ. 790 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. వివరాల కోసం సెల్ నంబర్ : 9010007261లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.


లగ్జరీ బస్సు

పర్యాటకానికి అనువుగా బయ్యారం పెద్దచెరువు

పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా అధికారి శివాజీ


బయ్యారం పెద్ద చెరువు వద్ద శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న పర్యాటకశాఖ ఉమ్మడి జిల్లా అధికారి శివాజీ

బయ్యారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు పర్యాటక ప్రాంతానికి అనువైందని పర్యాటక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ శివాజీ అన్నారు. సోమవారం బయ్యారం పెద్ద చెరువును సందర్శించిన ఆయన కట్టపై గల 11వ శతాబ్దంనాటి శిలశాసనాన్ని పరిశీలించారు. అలాగే కట్టపై ఉన్న కట్ట మైసమ్మ, మత్తడి, చెరువు లోతును తెలిపే తూము, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌ను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి కావాల్సిన అన్ని సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన స్థలంగా గుర్తించి రిసార్ట్‌లు, అతిథి గృహాలు నిర్మిస్తే పర్యాటకులకు ఎంతో దోహదపడుతుందని, తద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.


'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమాల్లో భాగంగా బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర (ఫైల్)

బేటీ బచావో.. బేటీ పడావో'కు పదేళ్లు

వచ్చే నెల 8వరకు ప్రత్యేక కార్యక్రమాలు

బాలికలకు అండగా..

రక్షణ మెండుగా..

వెంకటాపూర్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షను రూపుమాపి, మహిళ సాధికారతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2015 జనవరి 15న బేటీ బచావో.. బేటీ పడావో (ఆడ పిల్లలను రక్షించడం.. ఆడపిల్లలను చదివించడం) అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే దీనికి ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా బాలికల సంరక్షణ, స్త్రీ సాధికారిత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పౌరులకు విస్తృతంగా అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా సాధికారత కేంద్రాల ఆధ్వర్యంలో గత జనవరి 22 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు మార్చి 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బాలికల చట్టాలు లింగవివక్ష, విద్యాలయాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్.. తదితర అంశాలపై విస్తృతంగా అవగహన కల్పిస్తున్నారు. ఇబ్బందులు ఎదురైతే 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్నారు. అలాగే బాల్య వివహాలు చేసినా, స్త్రీలను లైంగికంగా హింసించినా, వరకట్న వేధింపులకు గురి చేసినా, గర్భంలోనే ఆడపిల్లను అంత మొందించినా.. చట్టపరంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులు బాలికలను బ్యాడ్‌టచ్ చేసినా, ఎలాంటి శిక్ష ఉంటుందనే దానిపై జిల్లా సాధికారత కేంద్రం, లీగల్ సెల్ ఆథారిటీ (న్యాయశాఖ) ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో తోటి విద్యార్థినిలను లైంగికంగా వేధిస్తే జరగబోయే పరిణామాలు, అందుకు పడే శిక్షల గురించి బాలురకు న్యాయ నిపుణలతో సమగ్రంగా వివరిస్తున్నారు.

విత్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమా లను నిర్వహిస్తున్నాం. జిల్లా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే లీగల్‌సెల్ ఆథారిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులతో అవగాహన కల్పిస్తున్నాం.

- అకిరెడ్డి రమాదేవి, ములుగు జిల్లా మిషన్ కోఆర్డినేటర్


ఇటీవల బాలికలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్, డిడబ్ల్యూవో, ఎస్పీ, ఇతరులు

జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాను కలిసిన సీపీ


జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రాకి పుష్పగుచ్ఛం అందజేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల కోసం సోమవారం హనుమకొండ పోలీస్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారితో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా , ఏఎస్పీ మనన్ భట్, ఏసీపీలు ఉన్నారు.


కేంద్రంలో పాలు పోస్తున్న పాడి రైతులు

జాగ్రత్తలు ఇవి..

పాలు పితికే వ్యక్తి కూడా ఆరోగ్యవంతుడై ఉండాలి. శుభ్రమైన దుస్తులు ధరించాలి. చేతి వేళ్ల గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. న్యుమోనియా, క్షయ, డీఫ్తీరియా, గజ్జి, తామర, కలరా లాంటి వ్యాధులతో ఉన్నవారు పాలు పితకకూడదు. మశూచి, గాలికుంటు, రేబిస్, దొమ్మ, బ్రూసెల్లోసిస్, పొదుగు వాపు వంటి వ్యాధులు సోకిన పశువుల నుంచి పాలు తీయరాదు. పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. ముందు పితికిన పాలల్లో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి వెన్న శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు పాలు దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.

లోపాలను అధిగమిస్తే లాభాలు

- పాలు పితకడంలో మెళకువలు పాటించాలి
- పరిశుభ్రత పాటిస్తే మరింత స్వచ్ఛత సాధ్యం

ఖానాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పశువుల నుంచి పితికిన పాలు ఎక్కువ సమయం నిల్వ ఉండాలన్నా, అధిక వెన్న శాతం సాధించాలన్నా శుభ్రత పాటించాలి. అప్పుడే స్వచ్ఛమైన పాలను దూర ప్రాంతాలకు తరలించొచ్చు. పాడి పశువులను పెంచడం వాటి పాలు పితకడం ఓ కళ. మెళకువలను పాటించినప్పుడే పాడి ఉత్పత్తి లాభాల బాట పడుతుంది. నాణ్యమైన పాలను పొందేందుకు మెళకువలు పాటించాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే ముఖ్యం

పాలు పితికే ముందు పాడి పశువు వెనుక భాగం, తొడలు, పొదుగు, తోక తదితర శరీర భాగాలను శుభ్రంగా కడిగి పొడి గుడ్డతో తుడవాలి. పశువులతో పాటు పాల పాత్రలను కడగటానికి పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి. పశువులు తాగేందుకు క్లోరినేషన్ చేసిన నీటినే వాడాలి. పాల రంగుపై ప్రభావం చూపే ఖనిజ లవణాలున్న నీటిని అసలు వాడరాదు. పాకలోని మురుగు నీరు ఎప్పటికప్పుడు బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలి. పాకలో ఫ్లోరింగ్‌ను పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలి. ఫినాయిల్, డెటాల్ వంటి వాటితో నేలను రోజు శుభ్రం చేసుకోవాలి. ఎలుకలు, బొద్దింకలు, క్రిమి కీటకాలు పాకలోకి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బూజు, దుమ్ము లేకుండా పశువుల పాకను ఎల్లప్పుడు శుభ్రం చేసుకోవాలి.. గాలి వెలుతురు బాగా వచ్చే ఎత్తైన ప్రదేశంలో పశువుల పాకను నిర్మించుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి

పచ్చగడ్డిని మేపేటప్పుడు క్రిమిసంహారక మందుల అవశేషాలు, చికిత్స చేసినప్పుడు యాంటి బయాటిక్స్ అవశేషాలు పశువుల శరీరంలో చేరే అవకాశం ఉంది. అలాంటప్పుడు పశువుల నుంచి తీసిన పాలు తాగినవారు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. పచ్చిగడ్డి పెంపకానికి ఎంత తక్కువగా మందులను వాడితే అంత మంచిది. అనవసర మందులను వాడరాదు. రాత్రి పితికిన పాలను, ఉదయం పితికిన పాలను కలపరాదు. అప్పుడే ఈనిన పశువుల పాలను పాల సేకరణ కేంద్రానికి పంపరాదు. గడ్డి పరకలు, క్రిములు, దుమ్ము, ధూళి పడకుండా పాల పాత్రలపై మూత వేసి ఉంచాలి. పాలలో బ్యాక్టీరియా ఎక్కువ వృద్ధి చెందుతుంది. పితికిన తర్వాత రెండు నుంచి మూడు గంటల్లో పాలను పాల సేకరణ కేంద్రానికి పంపించాలి. పాలల్లో ఎరుపు జీర, మరకలు కనిపిస్తే పొదుగు వాపు, గాయమయి ఉండవచ్చు. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి.


పాలు పితుకుతున్న రైతు

పాలు నిల్వ ఇలా...

స్టీలు అల్యూమినీయం పాత్రలనే వాడాలి. ఇనుము, రాగి పాత్రలు వాడితే పాలు త్వరగా చెడిపోతాయి. సొట్టలు, గీట్లు పడిన పాత్రలు వాడితే వాటిలో మురికి చేరి పాలు కలుషితమయ్యే ప్రమాదముంది. పాత్రలను నిత్యం రెండు పూటలా తోమాలి. వాషింగ్ సోడా కలిపిన వేడి నీటిలో కడిగి ఎండలో ఆరబెడితే మంచిది. వెచ్చటి వాతావరణంలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెంది పాలలోని చెక్కరను ఆమ్లంగా మార్చుతాయి. ఫలితంగా పాలు త్వరగా చెడిపోతాయి. పాలను నిల్వ చేయడానికి తినే సోడా, దుస్తుల సోడాలను కలుపరాదు. పాలలో నీళ్ల కలుపడం వల్ల వెన్న శాతంతో పాటు మిగిలిని ఘన పదార్థాలూ తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది. చుట్టు పక్కలగల వాసనను పాలు వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపల వాసన, మురుగునీటి వాసన వస్తే పాలు ఆ వాసనను గ్రహించి పులిసిన వాసన పాలకు వస్తుంది. పాలు పితికిన వెంటనే పరిశుభ్రమైన వస్త్రంతో వడకట్టాలి. రాత్రి తీసిన పాలతో తాజా పాలు కలపరాదు. తాజా పాలు కొంచెం తియ్యటి వాసన కలిగి ఉంటాయి.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీ సునీత, గంగు ఉపేంద్రశర్మ

25 నుంచి రుద్రేశ్వరాలయంలో

శివరాత్రి వేడుకలు


పోస్టర్ ఆవిష్కరణలో దేవాదాయ శాఖ ఏసీ సునీత

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పెట్టింది పేరైన చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు వైభవంగా మహా శివరాత్రి పర్వదిన వేడుకలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత చెప్పారు. ఆలయ కల్యాణ మండపంలో శివప్రీతికర సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌లతో కలిసి శివరాత్రి వేడుకల గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం వేయిస్తంభాల ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు స్పెషల్ అధికారిగాను నియమితులైన సునీత ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ. జిల్లా యంత్రాంగం, నగర పాలకసంస్థ, పోలీసు, ఆర్ అండ్ బీ తదితర శాఖల సమన్వయంతో ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఆలయానికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూల్‌లైన్‌లతోపాటు మంచినీటి సౌకర్యం, జాగరణ ఉండే భక్తుల కోసం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో జాగరణ ఉండే భక్తులకు పండ్లు, ప్రసాదాలు వితరణ చేస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదిన వేళ లింగోద్భవ కాలంలో చాలా ప్రాముఖ్యత కలిగిన ఈ సమయంలో వేద పండితుల ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 25వ తేదీన ఉదయం గణపతి పూజ, పుణ్యహవచనంతో మహాశివరాత్రి వేడుకలను శ్రీకారం చుడుతామని ఇదే క్రమంలో 26వ తేదీ శివరాత్రి వేళ రుద్రేశ్వర కల్యాణం, 27న నగవెల్లి సదస్యం, 28న స్వామివారికి మహా అన్నపూజ, మార్చి 1వ తేదీన ఆంజనేయస్వామికి చందనోత్సవం, ఆకుపూజ, మహా పూర్ణాహుతి, పుష్పార్చనలు నిర్వహిస్తామన్నారు. శివరాత్రి వేళ స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1116 చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. జాగరణ ఉండే భక్తుల కోసం ఈసారి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నా రు. పోలీసు అధికారి సతీష్ మాట్లాడుతూ. ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేందుకు మూడంచల వ్యవస్థతో పటిష్ట భద్రతా, మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్ల ను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్‌ను కూడా క్రమబద్ధీకరించను న్నట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు. వేయిస్తంభాల ఆలయంలో మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, దేవాదాయ శాఖ అధికారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో కూడా పోస్టర్ ఆవిష్కరించారు.

మడికొండ : మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఓరుగల్లు మహానగరంలో అతి ప్రాచీనమైన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీమెట్టు రామలింగేశ్వరాస్వామి, శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 24నుంచి మార్చి 4 వరకు నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో కార్యనిర్వాహణాధికారి కె. శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్, దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ సునిత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ములుగు

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

8

పోచమ్మ గుడిపై వివాదం

- ములుగు బస్టాండు విస్తరణ నేపథ్యంలో తరలింపునకు అధికారుల నిర్ణయం
- వ్యతిరేకిస్తున్న స్థానికులు, భక్తులు



ఆర్టీసీ బస్టాండు పక్కనే ఉన్న పోచమ్మ గుడి

ములుగు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న పోచమ్మ దేవాలయం వివాదంలో చిక్కుకుంది. బస్టాండు నిర్మాణంలో భాగంగా అడ్డుగా ఉందంటూ ఆలయాన్ని మరో చోటుకు తరలించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనిని స్థానికులు, భక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ములుగు గ్రామం ఆవిర్భావ సమయంలో గ్రామదేవత పోచమ్మను ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించినట్లు పురప్రముఖులు చెబుతున్నారు. అయితే.. మొన్నటి వరకు ఆలయం పాలశీతలీకరణ కేంద్రం స్థలంలో ఉండేది. బస్టాండు ఆధునీకరణలో భాగంగా పాలకేంద్రాన్ని వేరేచోటకు తరలించిన అధికారులు ఆ స్థలాన్ని ఆర్టీసీ సంస్థకు అప్పగించారు. నూతన బస్టాండు భవనం, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, షాపింగ్ కాంప్లెక్స్‌ల నమూనాలను సిద్ధం చేశారు. ఈక్రమంలో బస్సుల రాకపోకలు, భవనాల నిర్మాణానికి పోచమ్మ దేవాలయం అడ్డుగా ఉందని, వేరేచోట స్థలం కేటాయించి పునఃప్రతిష్ఠకు సహకారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు. దీనిని హిందూ సంఘాల నేతలు, భక్తులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజల భక్తి, విశ్వాసాలతో ముడిపడి ఉన్న పోచమ్మ విగ్రహాన్ని తొలగించడం ఊరికి మంచిది కాదని, గుడిని అక్కడే ఉంచి ఎవరికీ ఇబ్బందులు కలగకుండా బస్టాండు అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు. సోమవారం గుడిని శుద్ధిచేసిన భక్తులు పోచమ్మకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమ కార్యాచరణను రూపొందించుకొని రోడ్డెక్కుతామంటున్నారు. ఈవిషయమై స్థానికంగా వాట్సాప్ గ్రూప్‌లలో అభిప్రాయ సేకరణ కూడా జరుపుతున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క స్పందించి భక్తుల మనోభావాలను కాపాడాలని కోరుతున్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

టీఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ దివాకర



టీఎన్జీవోస్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు పోలు రాజు అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా నాలుగో తరగతి ఉద్యోగుల క్యాలెండర్, మహిళా విభాగం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకాన్నీ ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో జిల్లా ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించడం సంతోషకర విషయమని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో టీఎన్జీవోస్ యూనియన్ ముఖ్య భూమిక పోషించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, అసోసియేట్ అధ్యక్షుడు భూక్య లాల్‌నాయక్ కోశాధికారి కుమారస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు, నూతన కార్యవర్గ సభ్యులు, నాలుగు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు, నాలుగో తరగతి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

వాజేడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి వినీత్(13) జ్వరంతో మృతిచెందడంతో వైద్యఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ ఏటూరు నాగారం పీవో ఆదేశాలలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు కోరం క్రాంతి కుమార్, మాతాశిశు సంరక్షణ వైద్యాధికారి డాక్టరు యోషిత విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఆశ్రమ పాఠశాలలోని గదులను, వంట గదిని, పరిసరాలను పరిశీలించి ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జలుబు, దగ్గుతో బాధ పడుతున్న 20 మంది విద్యార్థులకు మందులు అందజేశారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరంలా అనిపిస్తే ఏఎన్ఎంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, హెచ్ఈవో వేణుగోపాలకృష్ణ, పీహెచ్ఎన్ సంగీత, హెచ్ఎస్ కోటిరెడ్డి, ఎంసీహెచ్ నర్సింగ్ ఆఫీసర్ అనూష, ఏఎన్ఎం శకుంతల, హెచ్ఏ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

వెంకటాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎమ్డీ.సర్వర్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యా ర్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన సమావేశంలో హెచ్ఎం సర్వర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బోధన శ్రమను గుర్తించాలని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.సుమన్, అంగన్‌వాడీ టీచర్ ఎర్రబెల్లి సరోజన, తదితరులు పాల్గొన్నారు.

లక్నవరం లోతట్టు గ్రామాలకు సాగునీరు అందించాలి : రైతు సంఘం

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లక్నవరం లోతట్టు గ్రామాలకు సాగునీరు అందించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.అమ్జద్‌పాషా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ములుగు మండలంలోని లోతట్టు గ్రామాలైన కన్నాయిగూడెం, పంచోత్కులపల్లి, రాయినిగూడెం, దుబ్బగూడెం, లాలాయిగూడెం, కొత్తూరు, సర్వాపూర్, జగ్గన్నగూడెం, అంకన్నగూడెం, పెగడపల్లి, తదితర గ్రామాల్లోని రైతులు సుమారు 1,500 ఎకరాల్లో యాసంగి వరి పంట సాగుచేస్తున్నారని అన్నారు. ఆయా పంట పొలాలకు ఎస్సారెస్పీ ద్వారా నీరందించాలని కోరారు. నల్లబెల్లి మండలం రంగయ్య చెరువు పైపులైన్ ద్వారా ములుగు మండలంలోని అన్నంపల్లి తొర్రికుంటకు, పత్తిపల్లి గ్రామంలోని ఏదుళ్లచెరువు, బుగ్గ చెరువులకు సాగు నీరు అందించాలన్నారు. వెంకటాపురం మండలంలోని పాలెంవాగు ప్రాజె క్టు, మంగపేట మండలంలోని నర్సింహసాగర్ ప్రాజెక్టు, రామప్ప, లక్నవరం, ఎస్సారెస్పీ కాలువల లైనింగ్ పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు వెంకటరమణ, మర్రి స్వామి, కొత్తకొండ సాంబయ్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వాజేడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్సై పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలోని పేరూరు, రాంపూర్, బీమారం ఇసుక లోడింగ్ ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. తూనూరి చంటి, ధాసరి రామయ్య, కాకర్లపూ ప్రవీణ్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలిమెల మండలంలో కలెక్టర్ పర్యటన



అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

మహాదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మారుమూల పలిమెల మండలంలో కలెక్టర్ రాహుల్‌శర్మ సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. ముకునూరు గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. తిమ్మేటిగూడెంలోని ఆశ్రమ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి వివరాలను అపార్‌లో నమోదు చేయాలన్నారు. అంతకుముందు ముకునూర్ శివారు ప్రాంతంలో ఫ్రెంచ్ ఇంజనీర్లు నిర్మించి వదిలేసిన ఇచ్చంపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్



కాటారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కాటారం గ్రామానికి చెందిన బొడ్డు రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ నియామకపత్రం అందించారు. రాజ్‌కుమార్ నియామకంపై పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కోటంచ జాతర వేలం ఖరారు

రేగొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతర వేలం పాటలు సోమవారం ఖరారయ్యాయి. కొబ్బరికాయలు విక్రయించే హక్కు రూ. 9,01000, కొబ్బరికాయలు పోగు చేసుకునే హక్కు రూ. 1,38000, లడ్డు, పూలిహోర పలహారం రూ. 8,50000, పూలదండలు రూ. 50 వేలు, బొమ్మలు రూ. 1,01000 స్వీట్ షాప్ రూ.50 వేలు, నూనె గురుగులు విక్రయించే హక్కు రూ. 25 వేలు ఖారారైనట్టు ధర్మాదాయ దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి శేఖర్ తెలిపారు. వేలం పాటల ద్వారా ఆలయానికి రూ. 21,15,000 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ భిక్షపతి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూర్ అటవీ ప్రాంతంలో కార్చిచ్చు

మల్హర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారం నుంచి కొయ్యూర్‌కు వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతంలో కార్చిచ్చు మొదలైంది. ఈ మంటలు అడవంతా వ్యాపించి పచ్చని చెట్లు కాలిబూడిదయ్యే అవకాశం ఉంది. సుమారు కిలో మీటర్ మేర ఈ కార్చిచ్చు వ్యాపించింది. దీంతో రోడ్డు మార్గం పొగతో నిండిపోయింది.

సూపర్‌మార్కెట్లలో మాయాజాలం

కాకతీయఖని ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని మంజూరునగర్‌లో ఓ సూపర్ మార్కెట్ ఘరనా మోసానికి పాల్పడినట్లు సుధాకర్ అనే వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు సూపర్‌మార్కెట్‌లో సరుకులు తీసుకున్న ఆయన బిల్లు అడగ్గా అక్కడి ఉద్యోగి రూ.4813 బిల్లును ఇచ్చినట్లు తెలిపాడు. వినియోగదారుడు బిల్లు కట్టి సరుకులతో ఇంటికి వచ్చి పరిశీంచగా రూ.1285 అదనంగా పడినట్లు గమనించాడు. బాధితుడు సుధాకర్ సూపర్ మార్కెట్ వెళ్లి ప్రశ్నించగా పొరపాటున జరిగిందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. భూపాలపల్లి సూపర్ మార్కెట్లలో ఇలాంటి మోసాలు తరుచు జరుగుతుండటంతో వినియోగదారులు నష్టపోతున్నారు. ఇటీవల పట్టణంలో ఉడిపి హోటల్ సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌లో అదనపు బిల్లు వసూలు చేసిన ఘటన జరిగింది. సంబంధింత అధికారులు సూపర్ మార్కెట్లలో తనిఖీ నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి దోపిడీలు జరుగుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఉచ్చులు పెట్టే వారెవరైనా ఉపేక్షించొద్దు : డీఎఫ్‌వో

కాటారం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వేట కోసం ఉచ్చులు పెట్టేవారెవరైనా ఉపేక్షించొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ అధికా రులను డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఆదేశించారు. కాటారం రేంజ్ పరిధిలోని కాటారం బీట్ అడవుల్లో ఆయన సోమవారం పర్య టించారు. కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలో గత కొన్ని రోజులుగా పెద్ద పులి సంచరిస్తున్న నేపథ్యంలో డీఎఫ్‌వో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. కాటారం ఎఫ్ఆర్వో స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్‌తో కలిసి డీఎఫ్‌వో కాటారం బీట్ పరిధిలోని 168, 169 కంపార్ట్‌మెంట్‌ల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. గతేడాది ఫిబ్రవరి 12న గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ విద్యుత్ ఉచ్చుకు చిక్కి మృతిచెందిన సంఘటనా స్థలాన్ని డీఎఫ్‌వో పరిశీలించారు. అడవుల్లో విద్యుత్ ఉచ్చులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు సంజీవ్, అశోక్ పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్.. ఇద్దరి అరెస్టు

మహదేవపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన తాజా మాజీ ఉప సర్పంచ్ ఆరుట్ల పవన్‌చారి, సర్పంచ్ భర్త వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డిని స్థానిక ఎస్సై తమాషారెడ్డి సోమవారం అరెస్టు చేశారు. పంచాయతీ అభివృద్ధికి కేటాయించిన నిధులను వీరి సొంతంగా వాడుకున్నారని గ్రామస్థులు పవన్‌చారి, మోహన్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. దీంతో వీరిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్ : ఎస్పీ ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలు, బాలికలకు అండగా భరోసా సెంటర్ నిలు స్తుందని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా సెంట ర్‌ను ఆయన సోమవారం సందర్శిం చారు. నిర్వాహకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా కేంద్రం, హింస, లైంగిక బాధిత మహిళలకు, బాలికలకు వైద్యం, కౌన్సిలింగ్, లీగల్, ఇతర రకాల సేవలు అందిస్తోందన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తోందని, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, బాలికలకు సంబంధించి కేసు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన సమయం నుంచి బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్ కుమార్, ఎస్సై స్వప్నకుమారితో పాటు భరోసా కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేయాలి

కాటారం (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని పోలీసు అధికారులు, టీఎస్ఎండీసీ సిబ్బందిని ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మండలంలో 353(సీ)జాతీయ రహదారిపై మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఇసుక లారీలు, టిప్పర్లను సిబ్బంది తనిఖీలు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఒకే డీడీతో డబుల్ ట్రిప్పులు, నెంబర్ ప్లేట్లు మార్చే లారీలు, నకిలీ బిల్లులు, అడ్రస్ చేంజ్‌వంటి అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై పీడీపీపీ, ఎంఎంఏ కేసులు నమోదు చేస్తామని లారీల డ్రైవర్లను హెచ్చరించారు. ఆయన వెంట కాటారం సీఐ నాగార్జునరావు తదితరులు ఉన్నారు.

భూములిచ్చినా ఏం లాభం!

(5వ పేజీ తరువాయి)

కోట్లు కొల్లగొట్టారు. వీరికి పలు పార్టీల నాయకులు తానాతందానా అంటూ సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు తక్కువ భూమి కలిగిన వారికి అప్పటి సర్వే, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, కొందరు నాయ కులు అండదండలుగా ఉండటంతో రూ.2కోట్లకు పైగా స్వాహాపర్వం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 41లో 33ఎకరాలకు పైగా పరిహారం రాలేదని అర్హు లైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా అధికారులు మాత్రం ఆ సర్వే నంబర్ మొత్తానికి పరిహారం ముట్టినట్లు రికార్డుల్లో ఉందని చెబు తున్నారు. ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు పలువురు భూనిర్వాసిత రైతులు పరిహారం అందలేదని తమ బాధలు తెలపగా అధికారులను ప్రశ్నించడంతో సర్వే నెంబర్ 41లోనే కాకుండా పూర్తి స్థాయిలో భూసేకరణకు పరిహారం డబ్బులు ముట్టాయని చెప్పినట్లు, దీంతో మంత్రి అనర్హుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించైనా డబ్బులు వసూలు చేసి అర్హులకు పరిహారం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అర్హుల మైనా ఇంకా పరిహారం అందని రైతులకు వెంటనే పరిహారం చెల్లించడంతో పాటు భారీ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రీ సర్వే పేరిట కొత్త ప్లాన్

ఓవైపు అర్హులైన తమకు పరిహారం అందలేదని కొందరు రైతులు వ్యయప్రయాసలకు లోనవుతుండగా, ఇదే అదనుగా వారికి పరిహారం వచ్చేందుకంటూ కొందరు రీ సర్వే పేరిట అధికారులతో కుమ్మక్కై కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో పర్యటించకుండానే కొందరు చెప్పినట్లు ఒకరిద్దరు అధికారులు గుడ్డిగా రీసర్వే పేరిట 14గుం టలున్న వారికి ఎకరానికి పైగా ఉన్నట్లు, ఇలా చాలామంది పేరిట పరిహారం కోసం ప్రతిపాదనలు తయారు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఓవైపు అవకతవకలు జరిగి కోట్లాది పరిహారం డబ్బులు స్వాహా అయ్యాయని రైతులు అంటుండగా, సేకరించిన భూములన్నింటికీ డబ్బులు చెల్లించినట్టు అధి కారులు చెబుతున్నారు. ఇంకోవైపు కొత్త ప్రతిపాదనలతో మరోసారి ప్రభుత్వాన్ని బోల్తా కొట్టించి ప్రజాధనం స్వాహా చేయాలని మరికొందరు ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది.

విద్యార్థి మృతిపై విచారణ

వాజేడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి సోయం వినీత్(13) శనివారం రాత్రి జ్వరం, కడుపు నొప్పితో మృతిచెందిన నేపథ్యంలో ఏటూరు నాగారం ఐటీడీఏ అధికారులు విచారణ చేశారు. పేరూరు ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహి స్తున్న హెచ్ఎం, వార్డెన్, ఏఎన్ఎంలతో పాటు వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, ఏటీడీవోల నుంచి నివేదికలు అందుకున్నారు. విద్యార్థి ఈ నెల 13న తలనొప్పిగా ఉండటంతో ట్యాబ్లెట్ ఇచ్చారని, దీంతో పరిస్థితి మెరుగు అయిందని గుర్తించారు. మేనమామ శ్రీకాంత్ ఇంటి వద్ద వినీత్‌కు కడుపునొప్పి రావటంతో ఫస్ట్‌ఎయిడ్ నిమిత్తం ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారని, శనివారం రాత్రి పరిస్థితి విషమించి ఏటూరు నాగారం తీసుకెళ్తుండగా మృతిచెందాడని డీడీ పోచం తెలిపారు. విద్యార్థి మృతికి ఆశ్రమ పాఠ శాల వార్డెన్, హెచ్ఎం, ఏఎన్ఎంల నిర్లక్ష్యం లేదని గుర్తించినట్లు ప్రకటించారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందన

విద్యార్థి మృతిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతి స్పందించారు. మండలంలోని ధర్మవరంలో విద్యార్థి వినీత్‌కు చికిత్స చేసిన ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి చికిత్సను అందించారని ప్రశ్నించారు. పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగునీరు అందించడంలో పాలకులు విఫలం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



చెక్‌డ్యాం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

టేకుమట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. సాగునీరు తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రామక్రిష్టాపూర్(వీ), గుమ్మడవెల్లి గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యాం వద్ద రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. వెలిశాల గ్రామం నుంచి రామక్రిష్టాపూర్(వీ) చెక్‌డ్యాం వరకు పంటలను పరిశీలించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అదెందుకు సాధ్యం కావడం లేదని ప్రశ్నించారు. రైతుల పట్ల చిత్తశుద్ధి లేకపోవడం, సాగునీరును చివరి ఆయకట్టు వరకు తీసుకువచ్చేందుకు స్థానిక పాలకులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే రైతులకు సాగునీరు అందించలేకపోయారని ఆరోపించారు. స్థానిక శాసన సభ్యుడికి సాగునీరు ఎలా తీసురావాలనే అంశంపైన అవగాహన లేదని వ్యాఖ్యానించారు. వరి పంటలు ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, వెంటనే టేకుమట్ల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మాజీ ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, నాయకులు పోతనవేని ఐలయ్య, బందెల నరేష్, బిల్లకంటి ఉమేందర్, నేరేళ్ల శ్రీనివాస్, అది రఘు, పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, దోడ్ల కోటి, నేరేళ్ల రామకృష్ణ, నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదినోత్సవం



ములుగు మండలంలో మిర్చితోటలో కూలీతో కలిసి కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాగజ్యోతి

ములుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ములుగులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్‌కట్‌చేసి మొక్కలు నాటారు. మిర్చితోటలో పనిచేస్తున్న రైతులు, కూలీలతో కలిసి కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ములుగు, మల్లంపల్లి మండల అధ్యక్షులు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పాలెపు శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మాజీ జడ్పీటీసీ గై రుద్రమదేవి, నాయకులు పోశాల అనిత-వీరమల్లు, దగ్గు ప్రభాకర్‌రావు, గాజుల శ్రీనివాస్, పెరిక నర్సింగరావు, మేడబోయిన అశోక్, కాసర్ల కుమార్, రామిళ్ల రాజేందర్, అబ్బ గోపాల్‌రెడ్డి, అర్జున్‌నాయక్, జనగాం రవీందర్, స్వామిరావు, రాజ్‌కుమార్, రాజు, బొచ్చు రాజేందర్, జహీర్‌బాషా, నరేంద్రచారి, రాజబాబు, తోట సంపత్, బొంతల శ్రీను, సూరి, మెట్టు మల్లయ్య, ఎల్లావుల మల్లేష్, గణేష్, సదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.
- చిట్యాల (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్‌బాబు, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, నాయకులు కొత్తూరి రాజిరెడ్డి, ఈర్ల మల్లక్క, ఏరుకొండ రాజేందర్, మడికొండ రవీందర్, కాట్రేవుల కుమార్, వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్, రఘు, దామెర రాజు, రమణాచారి, సరోజన, కట్కూరి రాజేందర్, ముసాపూరి రవీందర్, కిరణ్, శ్రీనివాస్, నేపాలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, సంతోష్, శ్రావణ్, సడువలి, వెంకటస్వామి, సతీష్, రాజేంద్రాచారి, శ్రీశైలం, శ్రీలక్ష్మి, రాజు, నాగమణి, బాలరాజు, రాజేంద్రప్రసాద్, సుధాకర్, రాజబాపు, మహేష్, రాజయ్య, సాగర్, రాజేష్, సమ్మయ్య, రజనీకాంత్, దేవానాయక్, చంద్రయ్య పాల్గొన్నారు.
- గణపురం (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గణపేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహరావు, పూర్ణచందర్‌రెడ్డి, వీసం భరత్‌రెడ్డి, చింటూగౌడ్, సాయి పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన కేసీఆర్ జన్మదినోత్సవంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, జిల్లా నాయకులు కావేరి చిన్ని కృష్ణ, మఠం వెంకటేష్ , పూజారి కిషోర్, ఆలెం ప్రభాకర్, దుర్గం రాజేష్, చిలముల రాంబాబు, ఆకుల నారాయణ, గడ్డం నరేందర్ , నామని తిరుపతి తదితరులు పాల్గొన్నారు. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీపై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.
- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆధ్వర్యంలో జరిగాయి. పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మాజీ ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, నాయకులు పోతనవేని ఐలయ్య, బందెల నరేష్, బిల్లకంటి ఉమేందర్, నేరేళ్ల శ్రీనివాస్, అది రఘు, పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, దోడ్ల కోటి, నేరేళ్ల రామక్రిష్ణ, నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు ఆదేశాల మేరకు కేక్ కట్ చేశారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని క్రీడమైదానంల మొక్కలను నాటారు. 23 మంది కేసీఆర్ అభిమానులు రక్తదానం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, రామన్నగూడెం మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా, నాయకులు జాడి భోజారావు, కాళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం కార్యాలయంలో మొక్కలు నాటారు.
- గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు మండలంలోని పస్రాలో ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేసి మొక్కలు నాటారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు లకావత్ నర్సింహనాయక్, పిన్నింటి మధుసూదనరెడ్డి, సమ్మయ్య, పూర్ణచందర్, పృథ్వీ, మోహన్ రాథోడ్, అక్కినపల్లి రమేష్, తాటికొండ శ్రీనివాసచారి, గాంధీ పాల్గొన్నారు.
- మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కార్యకర్తలు , నాయకులు సంబరాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.
- మల్హర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాడిచర్లలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. గోనె శ్రీనివాస్‌రావు, రావుల కల్పన, జాగరి హరీశ్, మధుసూదన్‌రావు, మల్లేష్, రాజేశ్వర్‌రావు, రవి, బాపు, ప్రశాంత్, కుమార్, కిషన్, రాజయ్య, రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.
- రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు అనూష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడకలు ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ పాపిరెడ్డి, కోటంచ ఆలయ మాజీ ఛైర్మన్ రాజేశ్వరరావు, రేగొండ టౌన్ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు రూపిరెడ్డి చంద్రారెడ్డి, గోగుల చంద్రాకర్‌రెడ్డి, పోశాలు, మేకల రాజు, సృజన్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌రావు, యూత్ నాయకులు మాడగాని నరేష్, తాళ్లపల్లి చింటూ, బండి వెంకటేశ్, తడక శ్రీకాంత్, రాజు, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.
- వాజేడు (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెనుమల్లు రామాకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గొంది స్వరూప, నాయకులు నిజ్జా, కుర్సం రాంబాబు, అట్టం రఘుపతి, యాలం సర్వేశ్వరరావు, తాటి గోవర్ధన్, ఓంకార్, కల్లూరి సతీష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ జన్మదినోత్సవాన్ని మండలంలోఘనంగా జరుపుకున్నారు. మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి సర్కార్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.మల్లూరు గుట్ట మాజీ ఛైర్మన్ నూతలకంటి ముకుందం, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజు యాదవ్, మంగపేట సహకార సంఘం ఛైర్మన్ తోట రమేష్, వైస్ ఛైర్మన్ నరేందర్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, కె.శ్యాంబాబు, కొమరం ధనలక్ష్మి, ఖుర్బాన్ అలీ, శ్రీధర్‌వర్మ, సహకార సంఘం డైరెక్టర్లు సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావుగుప్తా, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.